సాక్షి చిత్తూరు

గురువారం । 1 । జూన్ । 2023



సాక్షి చిత్ర లేఖన పోటీలకు స్పందన

చిత్తూరులో బుధవారం సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. - 8లో



ముగిసిన బదిలీల కసరత్తు

15రోజులుగా సాగిన బదిలీల కసరత్తు బుధవారంతో ముగిసింది. ఐదేళ్లు దాటిన ఉద్యోగులు బదిలీ కానున్నారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	38	27
తిరుపతి	39	28
తిరుమల	34	23
గూడూరు	41	30
నగరి	39	28

న్యూస్‌రీల్

పారదర్శకంగా పోలీసుల బదిలీలు



కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: జిల్లా పోలీసుశాఖ బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియను పాదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ఎస్పీ రిశాంత్‌రెడ్డి తెలిపారు. నగరంలోని జిల్లా పోలీసుశాఖ కార్యాలయంలో బుధవారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్న 13 మంది ఏఎస్ఐలు, ఏడుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, 20 మంది కానిస్టేబుళ్లకు ఎస్పీ రిశాంత్‌రెడ్డి కౌన్సెలింగ్ చేశారు. ఖాళీలను బట్టి పోస్టింగ్‌లు ఇచ్చారు. విధుల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించి శాఖకు మంచి పేరు తీసుకోరావాలని ఈ సందర్భంగా ఎస్పీ సూచించారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ సుధాకర్, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, డీపీఓ క్లర్క్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

గణనాథుని హుండీ ఆదాయం రూ.1.19 కోట్లు



లెక్కింపును పరిశీలిస్తున్న చైర్మన్, ఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి హుండీ కానుకల ద్వారా రూ.1.19 కోట్లు లభించినట్లు దేవస్థానం చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఆలయంలో 16 రోజుల హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. బంగారం 23 గ్రాములు, వెండి కిలో 120 గ్రాములు, గో సంరక్షణ హుండీ ద్వారా రూ.6 వేలు, ఫారిన్ కరెన్సీ యూఎస్ఏ 535 డాలర్లు, ఆస్ట్రేలియా 15 డాలర్లు, మలేషియా 10 రిన్‌గిట్స్, ఇంగ్లండ్ 5 పౌండ్లు, సింగపూర్ 33 డాలర్లతో కలపి మొత్తం రూ.1.19కోట్లు ఆదాయం వచ్చినట్లు వివరించారు. డీఈఓ వెంకటసుబ్బయ్య, ఏఈఓలు, పర్యవేక్షకులు, సిబ్బంది, యూనియన్ బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

సాగుకు సాయం

అన్నదాతలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోంది. రైతు సంక్షేమమే లక్ష్యంగా వ్యవసాయానికి ఊతమిచ్చేందుకు విప్లవాత్మకమైన పథకాలను అమలు చేస్తోంది. అందులో భాగంగా పంటల సాగుకు ముందస్తు పెట్టుబడి నిధిని అందిస్తోంది. ఈ ఖరీఫ్‌లో రైతాంగానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రక్రియ పూర్తి చేసింది. గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంతో రైతుల ఖాతాలకు నగదును జమ చేయనున్నారు. జిల్లాలో 2,27,010 మందికి రూ.170.84 కోట్ల లబ్ధి చేకూరనుంది.





- ఖరీఫ్ పంటలకు ముందస్తు పెట్టుబడి
- నేడు ఐదో ఏడాది తొలి విడత రైతు భరోసా నిధుల చెల్లింపు
- జిల్లాలో 2,27,010 మంది ఖాతాల్లో రూ.170.84 కోట్ల జమ

చిత్తూరు అగ్రికల్చర్: ప్రభుత్వం ఐదో ఏడాది తొలివిడత రైతు భరోసా, పీఎం కిసాన్ నిధులను గురువారం రైతులకు అందించనుంది. జిల్లా వ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో అన్ని రకాల పంటలను దాదాపు 84 వేల హెక్టార్ల సాధారణ విస్తీర్ణంలో సాగు చేస్తారు. అత్యధికంగా వర్షాధార పంటగా వేరుశనగను 37 వేల హెక్టార్లలో సాగు చేస్తారు. ప్రభుత్వం ఇప్పటికే వర్షాధార వేరుశనగ పంటను ప్రోత్సహిస్తూ రాయితీపై విత్తనకాయలను 39,600 క్వింటాళ్ల మేరకు అందిస్తోంది. సాగుకు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా రైతు భరోసా కింద ముందస్తు పెట్టుబడి నిధిని కూడా అందించేందుకు చర్యలు తీసుకుంది. జిల్లాలో మొత్తం 2,27,010 రైతు కుటుంబాలకు రూ.170.84 కోట్ల మేరకు ఈ ఏడాదికి తొలివిడతగా జమ కానుంది. అందులో రైతు భరోసా కింద రూ. 5,500, పీఎం కిసాన్ కింద రూ.2 వేలు చొప్పున మొత్తం రూ.7,500 మేరకు అందించనున్నారు. రైతు భరోసా కింద జిల్లాలో మొత్తం 2,27,010 రైతు కుటుంబాలకు రూ.125.44 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం, 2,26,960 రైతు కుటుంబాలకు రూ.45.39 కోట్లను కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద అందించనుంది. ఏటా సాగుకు పెట్టుబడి సాయం అందజేస్తూ తమకు ప్రభుత్వం అండగా నిలబడడం తమ అదృష్టంగా భావిస్తున్నామని జిల్లాలోని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైతుల సంక్షేమం కోరే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా లబ్ధి రూ.కోట్లలో

నియోజకవర్గం	రైతులు	జమ చేసే నగదు
చిత్తూరు	13,149	9.89
పూతలపట్టు	37,382	28.15
పలమనేరు	42,086	31.59
కుప్పం	38,596	28.97
పుంగనూరు	41,550	31.35
నగరి	13,628	10.28
జీడీనెల్లూరు	40,619	30.59
మొత్తం	2,27,010	170.84

చిత్తూరులో జిల్లా స్థాయి కార్యక్రమం...

ఈ ఖరీఫ్ సీజన్‌కు రైతు భరోసా నిధుల జమ జిల్లా స్థాయి కార్యక్రమాన్ని గురువారం చిత్తూరులో నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు.

రైతు భరోసా కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి



షణ్మోహన్, కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా స్థాయిలో గురువారం నిర్వహించే రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ షణ్మోహన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులకు ఆర్థిక చేయూత నిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2019 అక్టోబర్ 15 నుంచి పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. 2023–2024 సంవత్సరానికి సంబంధించి మొదటి విడతగా జిల్లాలో 2,27,010 మంది రైతులకు రూ.170.84 కోట్లను ప్రభుత్వం రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుందని తెలిపారు. జిల్లా కేంద్రంలోని నాగయ్య కళాక్షేత్రంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమైయ్యే ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే. రోజా, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరువుతారని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మోసపూరితంగా టీడీపీ మేనిఫెస్టో



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్ : మహానాడు వేదికగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మోసపూరిత మేనిఫెస్టోని విడుదల చేశారని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం విమర్శించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. పది తుప్పు పట్టిన హామీలతో ప్రకటించిన మేనిఫెస్టో పూర్తిగా చీటింగ్ చార్జిషీట్ అని ఆరోపించారు. బ్రిటిష్ హయాంలోని జలియన్‌వాలీబాగ్ ఘటనకు చంద్రబాబు పాలనలో జరిగిన బషీర్‌బాగ్ ఘటనకు తేడాలేదని స్పష్టం చేశారు. కారంచేడులో దళితుల మారణకాండ, వంగవీటి రంగా హత్య, వనజాక్షిపై దాడులు తదితర నేరాలు టీడీపీ హయాంలోనే జరిగాయని వివరించారు. నదీ పరివాహక ప్రాంతంలో అక్రమంగా నిర్మించిన భవనాన్ని కూల్చితే విధ్వంసమని విమర్శించడం అవివేకమన్నారు. కుటుంబ నియంత్రణకు మంగళం పాడేలా పదిమందిని కనండి, ప్రజలు కట్టిన పన్నులతో పోషిస్తా అని చెప్పడం విధ్వంసం కాదా అని ప్రశ్నించారు. పోలవరం నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చినా, కేవలం కమీషన్ల కోసం గత టీడీపీ ప్రభుత్వం ప్రాజెక్టు పనులను తీసుకుని దోపిడీకి తెరతీసిందని ఆరోపించారు. గత ఎన్నికల సమయంలో 600 హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక విస్మరించిన ఘనుడు చంద్రబాబని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సాగుతున్న సంక్షేమ, అభివృద్ధి పనులను ఓర్వలేకే టీడీపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారని సిపాయి సుబ్రమణ్యం మండిపడ్డారు.

సాధారణ బదిలీల్లో స్థాన చలనం

చిత్తూరు కలెక్టరేట్ : సాధారణ బదిలీల్లో పలువురు తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్లకు స్థానచలనం కల్పిస్తూ కలెక్టర్ షణ్మోహన్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. తహసీల్దార్ ప్రసాద్‌బాబు (కలెక్టరేట్) నుంచి పలమనేరు ఆర్డీవో కార్యాలయం డీఏవోగా, అక్కడి డీఏవో బ్యూలా ను కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. చిత్తూరు సివిల్ సప్లైయిస్ సీఎస్‌డీటీ అరుణ కుమారిని చిత్తూరు తహసీల్దార్ కార్యాలయ ఈడీటీగా, అదే కార్యాలయ సీపీడీటీ పయణిని నగరి ఆర్డీవో కార్యాలయ డీటీగా బదిలీ చేశారు. సీపీడీటీగా ఉన్న రమేష్‌ను పలమనేరు ఆర్డీవో కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ బదిలీ చేశారు.


ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని 3 మండలాల్లో ఖాళీగా ఉన్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కో ఆప్షన్ మెంబర్ల ఎంపికకు జూన్ 8న ఎన్నికలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేశారని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. జూన్ 4న సంబంధిత ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని, ఇందు కోసం ప్రత్యేక అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. రామకుప్పంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ, విజయపురంలో వైస్ ఎంపీపీ–2, చిత్తూరు రూరల్‌లో కో ఆప్షన్ మెంబర్‌ను ఎన్నికలను ఎన్నికల సంఘం నియామవళి ప్రకారం నిర్వహించాలన్నారు. పరిషత్ ఎన్నికలు జరిగినా, ఇంతవరకు రామకుప్పం మండలపరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక జరగలేదు. పలుమార్లు ఈ పదవులకు ఎన్నిక నిర్వహించాలని నోటిఫికేషన్ ఇచ్చినా కోరం లేక వాయిదా పడింది. విజయపురం వైస్ ఎంపీపీ–2 దశరథ ఇటీవల 1998 డీఎస్సీలో అర్హత సాధించి ఉపాధ్యాయుడయ్యారు. ఆయన వైస్ ఎంపీపీ పదవికి రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది. చిత్తూరు గ్రామీణ మండలం కో ఆప్షన్ మెంబర్ ఖలీల్ మరణించడంతో ఆ పదవి ఖాళీ అయ్యింది.

అవినీతికి ఇక చెక్

ఇక ఎక్కడి నుంచైనా (ఎనీవేర్) భూ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. దూరభారాల నుంచి వినియోగదారులకు విముక్తి కల్పిస్తూ పూర్తి స్థాయిలో ఈ విధానాన్ని జూన్ 1 నుంచి ప్రభుత్వం అమల్లోకి తెస్తోంది. ఆయా పరిధిలో ఉండే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే కాకుండా ఎక్కడైనా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు విడుదల అయ్యాయి.

- నేటి నుంచి ఎనీవేర్ రిజిస్ట్రేషన్
- ఆన్‌లైన్‌లో ఈసీ, మార్కెట్ వ్యాల్యూ, నిషేధిత భూముల వివరాలు



చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారులకు సౌలభ్యంగా ఎనీవేర్ రిజిస్ట్రేషన్ విధానం గురువారం నుంచి అమలులోకి రానుంది. 2013 నుంచి ఈ విధానం ఉన్నా పూర్తి స్థాయిలో అమలు కాలేదు. దీన్ని పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు ఎనీవేర్ కింద రిజిస్ట్రేషన్ చేయాలంటే మార్కెట్ వ్యాల్యూ, ఈసీ, సంబంధిత ధ్రువీకరణ పత్రాలు సమర్పించి రిజిస్ట్రేషన్ ప్రకియ చేసేవారు. అనంతరం ఆస్తి ఏ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఉందో వారికి ఆన్‌లైన్ ద్వారా కాపీని పంపేవారు. అక్కడ సబ్ రిజిస్ట్రార్ తిరిగి మార్కెట్ వ్యాల్యూ, ఈసీ, నిషేధిత జాబితాలో ఆస్తి ఉందా అనే అంశాలు పరిశీలించి అనుమతి ఇచ్చేవారు. ఇందుకు ఎక్కువ సమయం పట్టేది. కొనుగోలుదారులు తమ సౌలభ్యం మేరకు ఎనీవేర్ విధానంలో రిజిస్ట్రేషన్ చేసుకునేవారు. జిల్లా వ్యాప్తంగా రోజూ 400 డ్యాక్యుమెంటేషన్లు జరుగుతుండగా, అందులో 60 వరకు ఎనీవేర్ కింద రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. సాధారణంగా రిజిస్ట్రేషన్‌కు అనుమతి ఇవ్వాల్సిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డబ్బులు ఇవ్వందే పనిచేయరనే వాదన ఉంది. వీటికి చెక్ పెట్టేందుకు ఆన్‌లైన్‌లో డీఫాల్ట్‌గా ఈసీ, మార్కెట్ వ్యాల్యూ, నిషేధిత భూముల వివరాలను అందుబాటులో ఉంచనున్నారు. చెక్‌స్లిప్, రిజిస్ట్రేషన్ ప్రక్రియ సమయంలో పొరబాటు ఉంటే తెలుసుకునే అవకాశం ఉంది. రిజిస్ట్రేషన్ అనుమతి కోసం మరో సబ్ రిజిస్ట్రార్ అనుమతి అవసరం లేదు. నిబంధనలకు మించి రిజిస్ట్రేషన్ చేస్తే సంబంధిత సబ్‌రిజిస్ట్రార్ పై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.

క్లుప్తంగా

నేటి నుంచి రేషన్ పంపిణీ

చిత్తూరు రూరల్: జిల్లా వ్యాప్తంగా గురువారం నుంచి రేషన్ పంపిణీ ఉంటుందని డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. రేషన్‌బండి ద్వారా కార్డుదారులకు సరుకుల పంపిణీ జరుగుతుందన్నారు. ఈనెల 15వ తేదీ లోపు కార్డుదారులు అందుబాటులో ఉండి సరుకులు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిత్తూరు అర్బన్: చిత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) రూరల్ పోలీసులు బుధవారం బంగారుపాళ్యం మండలంలో జరిపిన దాడుల్లో 75 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. వీటిని తీసుకొస్తున్న ధరణీప్రసాద్ అనే వ్యక్తి పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

సాక్షి చిత్రలేఖనం పోటీలకు విశేష స్పందన

జిల్లా కేంద్రంలోని తపోవనం పాఠశాలలో బుధవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం శిక్షణ, పోటీలకు అనూహ్య స్పందన లభించింది. పలు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సృజనాత్మకతను చాటుతూ అద్భుత చిత్రాలను వేశారు. ఉత్తమ ప్రతిభ చాటి నలుగురు విద్యార్థులు స్ఫూర్తిగా నిలిచారు.

- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- ప్రతిభ చాటిన వారికి బహుమతులు
- 'సాక్షి'కి చిన్నారుల కృతజ్ఞతలు



పోటీల్లో వేసిన చిత్రాలను చూపుతున్న విద్యార్థులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న చిత్రలేఖనం శిక్షకులు రామచంద్రారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : చిత్రలేఖనం ఊహకు రూపాన్ని ఇచ్చే చక్కని సాధనం. ఈ కళకు పరిమితులు లేవు. సహజత్వాన్ని ప్రతిబింబించే చిత్రలేఖనానికి ప్రత్యేక స్థానం ఉంది. చిత్రకారుడు సృష్టికి ప్రతి సృష్టి చేయగలడు. అటువంటి చిత్రలేఖనంలో ఎందరో ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. మరెందరో అద్భుతాలను సృష్టించి ఖ్యాతి పొందారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చి విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు 'సాక్షి' చొరవ చూపింది. ఒక్కరోజు చిత్రలేఖనం శిక్షణ పోటీలు నిర్వహించింది. ప్రతిభ చాటిన వారికి జిల్లా బాలభవన్‌లో విధులు నిర్వహించే చిత్రలేఖన శిక్షకులు రామచంద్రారెడ్డి బహుమతులు అందజేశారు. అనంతరం బహుమతులు అందుకున్న విద్యార్థులు తమ అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

ఇష్టంతో నేర్చుకుంటున్నా



నేను ఒకటవ తరగతి చదువుతున్నా. చిత్రలేఖనమంటే ఎంతో ఇష్టం. ఆ ఇష్టంతో చిత్రలేఖనం నేర్చుకుంటున్నాను. తల్లిదండ్రులు వేసవి శిక్షణకు పంపించారు. బొమ్మలు వేయడం బాగా నేర్చుకుంటున్నాను.

– సంస్కృతి, ఒకటవ తరగతి విద్యార్థిని

ప్రకృతి చిత్రాలు అంటే..



చిత్రలేఖనంలో మా నాన్నే నాకు స్ఫూర్తి. మూడేళ్లుగా నేర్చుకుంటున్నాను. పాఠశాల స్థాయిలో పోటీల్లో పాల్గొంటున్నాను. మా డ్రాయింగ్ మాస్టర్ మెలకువలు నేర్పిస్తున్నారు. నాకు ప్రకృతి అంటే చాలా ఇష్టం. ప్రకృతిపై చాలా చిత్రాలను వేశాను. 'సాక్షి' ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉంది.

– తేజేష్, మూడవ తరగతి

చిన్నప్పటి నుంచి అలవాటు



చిన్నప్పటి నుంచి నాకు పెయింటింగ్ వేసే అలవాటు ఉంది. క్రమంగా శిక్షణ పొందుతున్నాను. ఖాళీ సమయాల్లో బొమ్మలు వేస్తుంటాను. చాలా పోటీల్లో పాల్గొన్నాను. మాలాంటి వారిని ప్రోత్సహించేందుకు 'సాక్షి' ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉంది.

– రాధాకృష్ణ, 8 వ తరగతి విద్యార్థి

గ్రామీణ జీవితం ప్రతిబింబించేలా



చిన్నప్పటి నుంచి డ్రాయింగ్ అంటే ఇష్టం. ఏదైనా పండుగ, సంఘటన ప్రభావంతో సందేశాత్మక పెయింటింగ్ వేస్తాను. చిన్నతనంలో అమ్మవేసిన ముగ్గులకు రంగులు అద్దేదాన్ని. చాలా మందికి ఫొటోలను పెన్సిల్ స్కెచ్ వేసి బహుమతిగా ఇచ్చేదాన్ని. హైస్కూల్‌లో జిల్లా స్థాయి పోటీల్లో మొదటి బహుమతి వచ్చింది. సామాజిక పరిస్థితులపై ఆలోచించే గలిగేలా ఆధునిక చిత్రకళలో రాణించాలనుంది.

– వైష్ణవి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని

సాక్షి కృషి అభినందనీయం



చిన్నారుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సాక్షి పోటీలు నిర్వహించడం అభినందనీయం. చిత్రలేఖనం విద్యార్థుల రెగ్యులర్ స్టడీస్‌లో రాణించేందుకు ఉపయోగపడుతుంది. చిత్రలేఖనం పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. చదువుతో పాటు కళలు కూడా విద్యార్థులు నేర్చుకోవాలి.

– రామచంద్రారెడ్డి, చిత్రలేఖనం శిక్షకులు



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,350
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,600

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,000
రిటైల్ వెండి గ్రాము	రూ.76

సర్వర్ రెడీ..జోరుగా రిజిస్ట్రేషన్లు

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్ర వ్యాప్తంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏర్పడిన సర్వర్ సమస్య తీరింది. రెండు రోజులుగా సర్వర్ సమస్యతో అవస్థలు పడిన వినియోగదారులకు ఉపశమనం లభించింది. బుధవారం అమ్మకం, కొనుగోలుదారులతో జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిండిపోయాయి. రెండు రోజులుగా నిలిచిపోయిన డ్యాకుమెంట్లను రిజిస్ట్రేషన్ చేశారు. రోజువారీ డ్యాకుమెంటేషన్ కంటే అధికంగా రిజిస్ట్రేషన్లు అయినట్లు అధికారులు తెలిపారు. దీంతో పాటు ఈసీ, సీసీ, స్టాంప్‌పేపర్స్ కోసం కొనుగోలుదారులు అధిక సంఖ్యలో వచ్చారు.

జిల్లా పోలీసు ఫుడ్‌కోర్టు లీజుకు

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరం పోలీస్ గెస్ట్‌హౌస్ ఆవరణలోని పోలీసు ఫుడ్ కోర్టును లీజుకు ఇవ్వనున్నట్లు ఆర్‌ఐ అడ్మిన్ నీలకంటేశ్వరరెడ్డి తెలిపారు. ఆసక్తి గల వారు చిత్తూరు ఆర్మ్‌డ్ రిజర్వు కార్యాలయాన్ని లేదా 9440900747నంబరును సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక ఎస్సీ కాలనీ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి చెందినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. సీఐ అందించిన వివరాలు.. మేర్లపాక ఎస్సీ కాలనీకి చెందిన కంది మంగమ్మ(65) శ్రీకాళహస్తికి వెళ్లి తిరిగి బస్సులో మేర్లపాక ఎస్సీ కాలనీ స్టేజీ వద్ద దిగింది. ఇంటికి వెళ్లేందుకు కాలినడకన రోడ్డు దాటుతుండగా వీకోట నుంచి శ్రీకాళహస్తి వైపు పూలతో వెళుతున్న లారీ అతివేగంగా వచ్చి ఆమెను ఢీకొంది. వృద్ధురాలి ముఖభాగం నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో మంగమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యోగాసనాలతో ఆరోగ్యం మెండు


యోగా చేస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : యోగాసనాలతో ఆరోగ్యం మెండుగా ఉంటుందని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం వద్ద ఉన్న యోగా కేంద్రంలో బుధవారం యోగాసనాల కార్యక్రమంలో జేసీ పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ రోజంతా తీరిక లేని పనిఒత్తిడి వల్ల చాలా మంది ఆరోగ్యంపై శ్రద్ధ చూపలేకపోతున్నారన్నారు. ఉదయం నిద్ర లేవగానే ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు కనీసం 30 నిమిషాలు కేటాయించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు.

ఎస్జీటీలకు ఉద్యోగోన్నతుల ద్వారా ఎస్‌ఏ పోస్టులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మిగిలిన స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ఎస్జీటీలకు ఉద్యోగోన్నతులు కల్పించి భర్తీ చేయనున్నట్లు డీఈవో విజయేంద్రరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ అధికారుల ఉత్తర్వుల మేరకు జెడ్పీ మేనేజ్ మెంట్ హైస్కూళ్లలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ 17, గణితం ఒకటి, తెలుగు మీడియంలో గణితం ఒకటి, బయాలజికల్ సైన్స్ ఒకటి, తమిళ మీడియంలో మిగిలిన పోస్టులకు అర్హత కలిగిన ఎస్జీటీలకు ఉద్యోగోన్నతి కల్పించి భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఎస్జీటీ సీనియారిటీ జాబితాను డీవైఈవో, ఎంఈవోలకు పంపినట్లు తెలిపారు. జాబితాను పరిశీలించుకున్న తర్వాత ఎస్జీటీ టీచర్లు ఈ నెల 1వ తేదీన చిత్తూరు డీఈవో కార్యాలయానికి ఒరిజినల్ సర్వీస్ రిజిస్టర్ రావాలని తెలిపారు. విల్లింగ్, నాట్ విల్లింగ్ తప్పనిసరిగా లిఖిత పూర్వకంగా ఇవ్వాలన్నారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. హాజరుకాకపోతే ఉద్యోగోన్నతులకు విల్లింగ్‌గా పరిగణిస్తామని డీఈవో విజయేంద్రరావు తెలిపారు.

వివాహానికి హాజరై వస్తుండగా..

రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఓ మృతి


శంకర్‌నారాయణ రావు (ఫైల్)

బైరెడ్డిపల్లె: పలమనేరు–కుప్పం జాతీయ రహదారి దేవదొడ్డి వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఓ శంకరనారాయణరావు(55) అక్కడికక్కడే మృతి చెందారు. బైరెడ్డిపల్లె ఎస్‌ఐ వెంకటనరసింహులు కథనం మేరకు.. మండలంలోని లక్కనపల్లెకు చెందిన శంకర్‌నారాయణరావు వికోట మండలం పెద్ద బరనిపల్లెలో వీఆర్‌ఓగా పని చేస్తున్నాడు. వికోటలో జరిగే వివాహ వేడుకల్లో పాల్గొని ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వస్తుండగా దేవదొడ్డి వద్ద ఎదురుగా వస్తున్న కారు టైర్ పగిలి ద్విచక్రవాహనాన్ని ఢీ కొంది. ఈ ప్రమాదంలో శంకర్‌నారాయణరావు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఐ అశోక్, ఎస్‌ఐ వెంకటనరసింహులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి భార్య 3ఏళ్ల కిందటే మృతి చెందింది. ఇద్దరు కుమారులు ఉన్నారు. వీఆర్వో మృతికి పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే ఎన్.వెంకటేగౌడ, డీసీసీబీ చేర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ, వైఎస్సార్ సీపీ రాజంపేట ఎన్నికల పరిశీలకుడు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దయానందగౌడు, మాజీ ఎంపీపీ శ్రీనివాసులరెడ్డి, రెవిన్యూ అధికారులు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

రెండు రోజుల చిన్నారిని వదిలివెళ్ళిన తల్లి



గూడూరు: ఆడపిల్ల పుట్టిన రెండు రోజులకే ఓ తల్లి బిడ్డను వదిలించుకుంది. యాచకులు ఆ బిడ్డను ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. రెండు రోజుల క్రితం ఓ మహిళ గూడూరులోని చర్చి వీధిలో యాచకుల దగ్గరకు వచ్చింది. మూత్ర విసర్జనకు వెళ్ళి వస్తానని తన బిడ్డను చూస్తుండమని వారి చేతిలో పెట్టి పోయింది. రెండు రోజులువుతున్నా ఆ తల్లి రాకపోవడంతో యాచకులు బుధవారం నేరుగా గూడూరు ఆర్డీఓ కార్యాలయం వద్దకు వెళ్ళి అక్కడ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు ఆర్డీఓకు తెలియజేశారు. ఆర్డీవో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గూడూరు రూరల్ సీఐ దశరథరామారావు అక్కడకు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. సీసీ టీవీ ఫుటేజిల ద్వారా బిడ్డ తల్లిని గుర్తించారు. ఆమె పట్టణానికే చెందిన మహిళ కావడంతో ఆమె వద్దకు వెళ్ళి విచారించారు. ఆమె తనకు ఇప్పటికే ఇద్దరు మగ బిడ్డలున్నారని ఆడబిడ్డను పోషించలేక ఇలా చేశానని చెప్పారు. ఆ బిడ్డను ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. వారు బిడ్డను పిల్లల సంరక్షణ కేంద్రానికి తీసుకెళతామని తెలిపారు.

సాలిడ్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్ పరిశీలన

రేణిగుంట : స్వచ్ఛ సంకల్పంలో భాగంగా రేణిగుంటలో ఏర్పాటు చేసిన సాలిడ్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్‌ను బుధవారం డీఆర్‌డీఏ ఏపీడీ మాధవి పరిశీలించారు. చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాల ఏర్పాటుకు పైలెట్ ప్రాజెక్టు కింద రేణిగుంట, తిరుచానూరును ఎంపిక చేసినట్లు వెల్లడించారు. అయితే ఇక్కడి సిబ్బంది నిర్వహణ తీరు సక్రమంగా లేదని, దీనిపై ఉన్నతాధికారులకు నివేదించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరిబాబు, ఈఓపీఆర్డీ వెంకటరత్నమ్మ, సర్పంచ్ నగేశం, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, మస్తాన్ పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓపై కలెక్టర్ ఆగ్రహం

చిత్తూరు రూరల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి.ప్రకాశంపై మంగళవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పోస్టు భర్తీ విషయంలో అలసత్వం ఎందుకని ప్రశ్నల వర్షం కురిపించినట్లు సమాచారం. ప్రజాప్రతినిధులు, అధికారులందరి నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని..పద్ధతి మార్చుకోవాలని సూచించినట్లు సమాచారం.

ముగిసిన బదిలీల కసరత్తు

బదిలీల కోసం ఎదురు చూపులు చూస్తున్న ఉద్యోగులకు, టీచర్లకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పిన విషయం విధితమే. ఈనెల 17న ఉద్యోగుల సాధారణ బదిలీలకు, ఆ తర్వాత టీచర్ల బదిలీలకు ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులను అనుసరించి జిల్లా యంత్రాంగం బదిలీల కసరత్తు చేపట్టింది. 15 రోజుల పాటు జరిగిన కసరత్తు ఈనెల 31తో ముగిసింది. జిల్లాలో నిర్వహించిన బదిలీల కసరత్తు పై కథనం..

- ఐదేళ్లు దాటిన ఉద్యోగులకు స్థాన చలనం
- రెండేళ్లు పూర్తి అయిన వారు అభ్యర్థన బదిలీలకు దరఖాస్తు
- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు తొలిసారి బదిలీలు
- పలు శాఖల అధికారులకు సూచనలిచ్చిన కలెక్టర్ షణ్మోహన్


విద్యాశాఖలో బదిలీల కసరత్తును పరిశీలిస్తున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : పరిపాలన సౌలభ్యం కోసం ఉమ్మడి చిత్తూరు జిల్లాను మూడుగా విభజించిన విషయం విధితమే. జిల్లాల విభజన సమయంలో పలు శాఖల్లో ఉద్యోగులను నిబంధనల మేరకు కొత్తగా ఏర్పాటైన తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు విభజన చేశారు. ఆ తర్వాత ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీలకు అవకాశం కల్పించింది. ఇందుకు సంబంధించి విడుదల చేసిన జీవో ప్రకారం ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీల కసరత్తు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో గతంలో 66 మండలాలు ఉండేవి. విభజన అనంతరం చిత్తూరు జిల్లా పరిధిలోకి 32 మండలాలు వచ్చాయి. అలాగే తిరుపతి జిల్లా పరిధిలో, అన్నమయ్య జిల్లా పరిధిలో ఉన్న మండల్లాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. చిత్తూరు జిల్లా కేంద్రంలో ఉండే పలు శాఖల జిల్లా అధికారులు మిగిలిన రెండు జిల్లాల అధికారుల సమన్వయంతో కసరత్తు నిర్వహించారు.

20వేల మందికిపైగా ఉద్యోగులు

ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా పలు శాఖల్లో దాదాపు 20 వేలకు పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారిలో ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం ఉద్యోగులు, టీచర్లు బదిలీ కానున్నారు. అన్ని శాఖల్లో ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులను కచ్చితంగా బదిలీ చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. అలాగే రెండు సంవత్సరాలు పూర్తి అయ్యి బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వారికి నిబంధనల ప్రకారం పరిశీలించి బదిలీలు చేస్తున్నారు. పలు శాఖల్లో ఏసీబీ, విజిలెన్స్ కేసులు పెండింగ్‌లో ఉండే ఉద్యోగులను బదిలీలకు అనుమతించకుండా చర్యలు చేపట్టారు.

ముగిసిన గడువు

మే నెల 31వ తేదీతో బదిలీలకు గడువు ముగిసింది. దీంతో ఆయా శాఖల ఉన్నతాధికారులు బదిలీల కసరత్తులో తలమునకలై ఉన్నారు. కలెక్టర్ షణ్మోహన్ ఆదేశాల మేరకు వేగవంతంగా బదిలీల కసరత్తు చేపట్టారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం ఈనెల 31 తో సాధారణ బదిలీలకు గడువు ముగిసింది. జూన్ 1వ తేదీ నుంచి బదిలీలపై నిషేధం అమలులో ఉంటుందని ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల్లో సూచించారు. బుధవారం బదిలీలకు ఆఖరి రోజు కావడంతో రెవెన్యూ, మున్సిపాలిటీ, జెడ్పీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ, సోషల్‌వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనారిటీ, గిరిజన, ట్రెజరీ పలు శాఖల అధికారులు కసరత్తు నిర్వహించి కింది స్థాయి ఉద్యోగుల బదిలీల ఉత్తర్వులు జారీచేసేందుకు కసరత్తు పూర్తి చేశారు. బదిలీ ఉత్తర్వుల ప్రకారం కమిటీ చైర్మన్ ఆమోదం తీసుకున్న తర్వాత ఉత్తర్వులు జారీచేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

సచివాలయ ఉద్యోగులకు తొలిసారి

సచివాలయ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తొలిసారి బదిలీలకు అవకాశం కల్పించింది. ఆ ఉద్యోగులు ఉద్యోగంలో చేరిన తర్వాత ప్రస్తుతం మొదటి సారి బదిలీలు చేపడుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన సచివాలయ ఉద్యోగుల బదిలీలు నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే పనిలో సచివాలయ ఉద్యోగులు నిమగ్నమయ్యారు. జూన్ 10 సచివాలయ ఉద్యోగుల బదిలీల కసరత్తు చేపట్టనున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు



నిబంధనల మేరకు పారదర్శకంగా బదిలీల కసరత్తు చేపట్టాం. ఎటువంటి ఫిర్యాదులు, ఆరోపణలకు ఆస్కారం లేకుండా అత్యంత పారదర్శకంగా బదిలీల ప్రక్రియ చేపట్టాలని అధికారులను ఆదేశించాం. నిబంధనలకు, మార్గదర్శకాలకు వ్యతిరేకంగా బదిలీలుంటే తీవ్రంగా పరిగణించడం జరుగుతుంది. సంబంధిత శాఖల అధికారులపై శాఖాపరమైన చర్యలుంటాయ్. – షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు

ప్రత్యేక పర్యవేక్షణ..



రెవెన్యూ శాఖ పరిధిలో చేపట్టిన బదిలీలపై ప్రత్యేకంగా పర్యవేక్షణ చేశాం. నిబంధనలను అనుసరించి కసరత్తు చేపట్టాలని కింది స్థాయి అధికారులను ఆదేశించాం. ఐదు సంవత్సరాలు ఒకే చోట పనిచేసిన ఉద్యోగులు తప్పనిసరిగా బదిలీ అవుతారు. ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను అనుసరించి బదిలీల ప్రక్రియ చేపట్టాం. –శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్, చిత్తూరు